
సాక్షి పల్నాడు

గురువారం । 23 । జనవరి । 2025



ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరం కోటిలింగాల క్షేత్రంలోని మహాకాళేశ్వర సహిత మహాకాళీ ఆలయ ప్రథమ ప్రతిష్టా వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 558.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,567 క్యూసెక్కులు విడుదలవుతోంది.

చెన్నకేశవ స్వామి కళ్యాణం



మాచర్ల: మాచర్ల పాతఊరులోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి నిత్య కళ్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొన్నారు.

న్యూస్‌రీల్

ఉత్సవ విగ్రహాలు బహూకరణ



పిడుగురాళ్ల : స్థానికంగా ఉన్న శ్రీ సువర్చల ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయంలో సీతా రామలక్ష్మణ అంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను బుధవారం బహూకరించారు. పట్టణానికి చెందిన వ్యాపారి పెరుమాళ్ల రాజేష్ వారి ధర్మపత్ని వనజ లక్ష్మీలు సుమారు రూ.4.50 లక్షల వ్యయంతో ఉత్సవ విగ్రహాలను అందించారు. ఈనెల 25వ తేదీన ఆంజనేయ స్వామి వారి కళ్యాణ మహోత్సవం, రథోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాలను బహూకరించడం జరిగిందన్నారు.

నేటి నుంచి మిర్చి యార్డులో రైతులకు ఉచిత భోజనం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో గురువారం నుంచి రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 10.45 గంటలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నరసింహస్వామికి వెండి కిరీటం బహూకరణ



మంగళగిరి (తాడేపల్లిరూరల్) : మంగళగిరిలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి భక్తులు వెండి కిరీటాన్ని బుధవారం బహూకరణగా ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇ.వో. రామకోటిరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన రామారావు తన భార్య అన్నపూర్ణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు మధుసూదన్, రవికిరణ్‌లతో కలసి 1.300 కిలోల వెండితో, 3 గ్రాముల బంగారుపూతతో చేసిన వెండి కిరీటాన్ని స్వామివారి అలంకరణ నిమిత్తం అందజేశారని తెలియజేశారు. అనంతరం రామారావు కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గుంటూరు-గయ ప్రత్యేక రైలు



లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రైలు ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు-గయకు ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం తెలిపారు. నంబర్ 07719 గుంటూరు-గయ ఈ నెల 25న, 07720 గయ-గుంటూరు ఈనెల 27న ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని తెలిపారు.

యార్డుకు 90,138 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు) : గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 90,138 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 87,523 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,200 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,000 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 59,487 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు.

జేఈఈ మెయిన్... సీటే ఎయిమ్

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఐదు కేంద్రాల్లో సజావుగా నిర్వహణ

- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్
- పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన సిబ్బంది
- గుంటూరులోని ఒక పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులతో దురుసు ప్రవర్తన
- విద్యార్థుల వెంట వెళ్లిన తల్లిదండ్రులపైనా అనుచిత వ్యాఖ్యలు
- ఫొటోలు తీస్తున్న మీడియా ఫొటోగ్రాఫర్లతోనూ అదే తీరు



ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



గుంటూరు ఎడ్యుకేషన్ : దేశ అత్యున్నత విద్యాసంస్థలో సీటు సాధించడమే ధ్యేయంగా విద్యార్థులు జేఈఈ మెయిన్ పరీక్షకు బుధవారం హాజరయ్యారు. ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్-2025 మొదటి సెషన్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)కు విద్యార్థులు హాజరయ్యారు. బీఈ, బీటెక్ కోర్సుల్లోకి ప్రవేశాలకు ఉద్దేశించిన ఈ పరీక్షలు ఈ నెల 30వ తేదీ వరకు జరగనున్నాయి. 30న మధ్యాహ్నం పేపర్-2 బీఆర్క్ పరీక్ష జరగనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దీనికోసం గుంటూరులో మూడు, పల్నాడు జిల్లాలో రెండు చొప్పున ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు అయాన్ డిజిటల్ జోన్‌లలో ఏర్పాటు చేసిన కేంద్రాల పరిధిలో పరీక్షలు జరిగాయి. మొత్తమ్మీద దాదాపు 10 వేల మందికి పైగా విద్యార్థులు రాస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గుంటూరు శివారు నల్లపాడులోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రం వద్ద సిబ్బంది మాత్రం దురుసుగా ప్రవర్తించారు. విద్యార్థుల వెంట వెళ్లిన తల్లిదండ్రులను పరీక్షా కేంద్రం సమీపంలో ఎక్కడా వేచి ఉండరాదని హెచ్చరించారు. ఉదయం 9 గంటల పరీక్షకు 7 గంటలకే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని ఎన్‌టీఏ నిర్దేశించడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. నల్లపాడు పరీక్షా కేంద్రం వద్ద మీడియా ఫొటోగ్రాఫర్లపై అక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు.

వైభవంగా మల్లాది వేంకటేశ్వరుని కళ్యాణం



విశేష అలంకరణలో స్వామి వారు

అమరావతి: భక్తుల పాలిట కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీర్చే కలియుగవరదుడైన వేంకటేశ్వరుడే మల్లాది గ్రామంలో స్వయంభూగా వెలసిన వటవృక్షాంతర్గత వేంకటేశ్వరునికి బుధవారం 48వ వార్షిక కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువజామున ఆలయ అర్చకుడు వినుకొండ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి అభిషేకానికి బిందెతీర్థంతో కార్యక్రమాలు మొదలయ్యాయి. అనంతరం సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రాతఃకాల అర్చన నిర్వహించారు. స్వామి వారికి పంచసూక్తాలతో పంచామృత స్నపనను సశాస్త్రీయంగా చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన తులసీదళాలతో స్వామి వారికి సహస్రనామ తులసీదళసేవ జరిగింది. స్వామి వారికి విశేష అలంకారం చేశాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం పదకొండు గంటలకు దేవాలయ ఉత్తరభాగంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. కళ్యాణోత్సవ ఘట్టాన్ని ప్రారంభించారు. పరుచూరి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో సుమారు 70 మంది దంపతులచే స్వామి వారి కళ్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు పెదశేష వాహనంపై ఉభయదేవేరులతో వెంకటేశ్వరుని గ్రామోత్సవం వైభవంగా సాగిందిరు. ఈ సందర్భంగా భక్తులకు ఉచిత ప్రసాదాలను అందజేశారు. సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కళ్యాణోత్సవ అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి. సీతారామాంజనేయ భక్తసమాజం వారి భజన, శ్రీ వేంకటేశ్వరస్వామి బాలబాలికల కోలాటం సేవభజన సంఘం చిన్నారుల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వెంపాజ్వాలా లక్ష్మీ నరసింహారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యుత్ అదాలత్‌లపై అవగాహన కల్పించాలి

సీజీఆర్ఎఫ్ చైర్మన్



మాట్లాడుతున్న విక్టర్ ఇమ్మానియేల్

రాజుపాలెం: విద్యుత్ వినియోగదారుల అదాలత్ అవగాహన సదస్సుకు ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్. విక్టర్ ఇమ్మానియేలు సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని కొండమోడు విద్యుత్ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో విద్యుత్ వినియోగదారుల అదాలత్ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ హాజరయ్యారు. తక్కువ సంఖ్యలో వినియోగదారులు రావడంతో సిబ్బందిపై మండిపడ్డారు. అన్ని గ్రామాలలో సదస్సు గురించి అవగాహన కల్పించి ఎక్కువ మంది వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. రాజుపాలెం, సత్తెనపల్లి, మాచవరం మండలాల నుంచి వినియోగదారులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. 39 అర్జీలు రాగా, 34 పరిష్కారమయ్యాయి. అధిక బిల్లులు ఒకేసారి కట్టలేమని చైర్మన్ దృష్టికి వినియోగదారులు తీసుకెళ్లగా.. కిస్తీలవారీగా కట్టేందుకు పరిష్కారమార్గం చూపారు. 5 సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సదస్సులో పల్నాడు జిల్లా ఎస్ఈ డాక్టర్ విజయ్ కుమార్, మాచర్ల ఈఈ నూతలపాటి సింగయ్య పిడుగురాళ్ల డీఈఈ బయన సురేష్‌బాబు, ఏఈ సందీప్‌కుమార్, ఏఈ సైదారావు, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు.. మచ్చుకైనా కనిపిస్తే ఒట్టు



ధ్వంసమైన అమరావతి - వైకుంఠపురం రోడ్డు

- అధ్వానంగా మారిన అమరావతి - వైకుంఠపురం రహదారి
- ప్రమాదం అంచున మద్దూరు వాగు వంతెనపై ప్రయాణం

అమరావతి: వారసత్వ నగరం, ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రం, శైవాధ్యాత్మిక క్షేత్రమైన అమరావతికి విజయవాడ నుండి చేరుకోవాలంటే తుళ్లూరు మండలం దొండపాగు నుంచి ఉన్న మార్గమే కీలకం. అమరావతి వరకు సుమారు 20 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల సెప్టెంబరు నెలలో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు ఊహించని రీతిలో అమరావతి - వైకుంఠపురం వరకు సుమారు 11 కిలోమీటర్ల పొడవునా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. బస్సులు, లారీలు, కార్లే కాదు.. కనీసం ద్విచక్ర వాహనాలు తిరగటానికి కూడా వీలు లేకుండాపోయింది. వాహనచోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్రాంతి పండుగకు గుంతలన్నీ పూడుస్తామని గొప్పలు చెప్పింది. కానీ ఇంతవరకు ఈ వైపు చూసిన ప్రజాప్రతినిధులుగానీ, అధికారులుగానీ లేరు. అమరావతికి విజయవాడ నుంచి రావాలంటే వ్యయప్రయాసలకు ఓర్చాల్సిందే. తుళ్ళూరు, దొండపాడు, వైకుంఠపురం మీదుగా రావాల్సి ఉంటుంది. లేకపోతే విజయవాడ నుంచి గుంటూరుకు వెళ్లి.. అక్కడి నుంచి అమరావతికి సుమారు 30 కిలోమీటర్లు అదనంగా చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. లేకుంటే కంతేరు, తాడికొండ, 14వ మైల్ మీదుగా సుమారు 20 కిలోమీటర్లు చుట్టి చేరుకోవాల్సిందే.

రోడ్డు నిర్మాణానికి రూ.44.18 కోట్లు

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృషితో తుళ్లూరు నుంచి అమరావతి వరకు సుమారు 20 కిలోమీటర్లుపైగా నిర్మితమయ్యేలా ఈ రహదారి నిర్మాణానికి ఎన్‌డీబీ పథకం ద్వారా రూ. 44.18 కోట్లు మంజూరు అయ్యాయి. రోడ్డు వెంబడి అడ్డుగా పెద్ద చెట్లను తొలగించి, 20 కిలోమీటర్ల మేర ఉన్న కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశారు. ఈ క్రమంలో నూతనంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

ప్రమాదం అంచున రాకపోకలు

పెదమద్దూరు వాగుపై బ్రిడ్జి అడుగుభాగం పూర్తిగా ధ్వంసమైంది. తీవ్రంగా బలహీనపడటంతో సెప్టెంబరులో వరదలకు సైడ్ గోడలు కూలిపోయాయి. ప్రస్తుతం ప్రమాదకరస్థాయికి చేరింది. వాహనాల రాకపోకలను రోడ్డు భవనాల శాఖ నిషేధించింది. మట్టితో బ్రిడ్జి దెబ్బతిన్న దగ్గర మరమ్మతులు చేశాక అనుమతించారు. రాత్రిళ్లు ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మళ్లీ వాగులకు వరదనీరు వస్తే ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు.

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి



వాగుకు ఏటా వరద వచ్చినప్పుడు పక్క పొలాలు మునిగిపోతున్నాయి. భారీ వర్షాలు పడినా, కృష్ణానదికి వరద వచ్చినా వాగు పొంగి చప్టాపై మూడు నుంచి నాలుగు రోజులపాటు నీరు ప్రవహిస్తోంది. దీంతో అమరావతి - విజయవాడ మధ్య రాకపోకలు నిలిచి ఇబ్బంది పడుతున్నాం. వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు వేగంగా పూర్తిచేయాలి.

– యలగాల పాపారావు, అమరావతి

మరమ్మతులైనా చేయండి



వైకుంఠపురం - అమరావతి మధ్య రాకపోకలకు ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నాం. భారీ ఇసుక లారీల వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఏ అవసరానికైనా వెళ్లాలంటే సుమారు 9 కిలోమీటర్ల పొడవునా రోడ్డు గుంతలుగా ఉండటం వల్ల నరకయాతన పడుతున్నాం. రోడ్డుకు కనీసం మరమ్మతులు చేయాలి.

– రంగిశెట్టి శ్రీనివాసరావు, వైకుంఠపురం

త్వరగా బ్రిడ్జి నిర్మించాలి



శిథిలావస్థలో పెదమద్దూరు వాగు వంతెన

2022లో అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృషితో తుళ్లూరు - అమరావతి వరకు రోడ్డు పనులు చేపట్టాలని నిర్ణయించారు. పెదమద్దూరు బ్రిడ్జి నిర్మాణం కూడా అందులో భాగంగా ఉంది. బ్రిడ్జికి అప్పటి మంత్రి జోగి రమేష్ శంకుస్థాపన కూడా చేశారు. పనులు 60 శాతం పూర్తయ్యేసరికి ప్రభుత్వం మారటంతో ఆగాయి. చిన్న వర్షాలకు కూడా వాగు పొంగి పంట పొలాలు నీట మునిగిపోతున్నాయి. రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి పనుల వేగవంతం చేసి వచ్చే వర్షాకాలానికి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. యాత్రికులకు కోసం అమరావతి - దొండపాడు వరకు రోడ్డుకు సత్వరమే కనీసం మరమ్మతులైనా చేయాలని పేర్కొంటున్నారు.

ఆరుతడికీ కంటతడే!



పెదకూరపాడులో బెట్టకు వచ్చిన మిర్చి పంట



అధ్వానంగా పెదకూరపాడు ఎస్ మైనర్



ఎండిపోయిన అబ్బరాజుపాలెం బీ మైనర్

- అమరావతి మేజర్ దిగువ భూములకు అందని సాగునీరు
- సత్తెనపల్లి స్టేషన్ వరకే సమృద్ధిగా రాక
- అల్లాడుతున్న మిరప రైతులు
- బెట్టకు వచ్చిన పంట చేలు

పెదకూరపాడు: అమరావతి మేజర్ కాలువ పరిధిలోని దిగువన ఉన్న పెదకూరపాడు మండలంలోని ఎస్, ఎన్, క్యూ, బీ మైనర్లకు సాగునీరు అందక ప్రతి ఏడాది సమస్యలు వెంటాడుతునే ఉన్నాయి. ఈ ఇబ్బందులు అన్నదాతలకు కన్నీటినే మిగుల్చుతున్నాయి. మిర్చి పంట, మొక్కజొన్నకు సాగునీరు ఎంతో అవసరం. పెదకూరపాడు మండలవ్యాప్తంగా మిర్చి సాగుకు పెట్టింది పేరు. పంట కాపు మీద ఉండగా సాగునీరు అందక రైతులు అల్లాడుతున్నారు. పది రోజులుగా తగిన నీరు లేక మిరప పంటలు బెట్టకు వచ్చాయి. దీంతో రైతు ప్రతి ఏడాది ఇదే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

సత్తెనపల్లి స్టేషన్ వరకే....

అమరావతి మేజర్‌కు ఇరిగేషన్ అధికారులు 330 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఈ మేజర్‌పై ఉన్న సత్తెనపల్లి స్టేషన్ వరకే నీరు సమృద్ధిగా వస్తోంది. అబ్బూరు కాలువ మరమ్మతులు చేయడంతో అక్కడికే ఎక్కువగా వెళుతోంది. సత్తెనపల్లి స్టేషన్‌లో కూడా ఈ, టీ మైనర్లకు అందుతోంది. దీని పరిధిలో సుమారు 5 షట్టర్లు మరమ్మతులకు వచ్చాయి. అమరావతి మేజర్‌పై ఆకు పేరుకుపోవడంతో సాగునీరు దిగువకు రావడం లేదు. పెదకూరపాడు మండలంలోని ఎస్, ఎన్, క్యూ, బీ మైనర్లకు అందడం లేదు. వీటి కింద 4 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొంది.

మిర్చికి పెద్ద దెబ్బే...

మిర్చి పంట కాపు, పిందె దశలో ఉండటంతో సాగునీరు ఈ సమయంలో ఎంతో అవసరం. అమరావతి మేజర్‌కు నీరు సక్రమంగా రాకపోవడంతో వ్యయప్రయాసలతో రైతులు కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుంటలు, బావులను ఆశ్రయించి పంటకు నీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మోటార్ల సహాయంతో కిలోమీటర్ల పొడవునా పైపుల ద్వారా నీరు అందిస్తున్నారు. అసలే ధరలు లేక, పెట్టుబడులు పెరిగి అల్లాడుతున్న మిరప రైతులకు సాగునీటి సమస్య మరో భారంగా మారింది.

ఇప్పుడే సాగునీరు అవసరం



ప్రస్తుతం మిరప పంటకు సాగునీరు ఎంతో అవసరం. పంట పిందె మీద ఉంది. కాయగా మారేందుకు నీరు పెట్టాలి. చేలు ఇప్పటికే బెట్టకు వచ్చాయి. సకాలంలో నీరు అందితే బాగుంటుంది. అసలే ధరలు లేక నష్టాల్లో ఉన్నాం.

– కురగంటి మస్తాన్, కౌలు రైతు, పెదకూరపాడు

నాలుగు రోజుల్లో పరిష్కరిస్తాం

షట్టర్లు రిపేరు, ఆకు పేరుకుపోవడంతో సాగునీరు దిగువకు పారడం లేదు. నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. అన్ని మైనర్లలో దిగువకు నీరు వెళ్లేలా తగిన చర్యలు తీసుకుంటాం.

– పేరం చిరంజీవి రెడ్డి, ఏఈ, ఇరిగేషన్, పెదకూరపాడు

ఆర్టీసీకి 'పండగే'

- సంక్రాంతి ఆదాయం రూ.51.61 లక్షలు
- గతేడాది కంటే రూ.6.56 లక్షలు అదనం



నరసరావుపేట: జిల్లాలో సంక్రాంతిని పురస్కరించుకొని ఆరు డిపోల ఆర్టీసీ బస్సుల ద్వారా రూ.51.61 లక్షల ఆదాయం వచ్చిందని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇది గతేడాది కంటే రూ.6.56 లక్షలు ఎక్కువని తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'కి తెలిపిన వివరాల ప్రకారం.. సంక్రాంతి సందర్భంగా నరసరావుపేట నుంచి 52, మాచర్ల 50, చిలకలూరిపేట 77, సత్తెనపల్లి 8, పిడుగురాళ్ల 23, వినుకొండ 61 బస్సులు కలిపి మొత్తం 271 ఏర్పాటు చేశామన్నారు. అవి 1,48,367 కిలోమీటర్లు తిరిగి 17,631 మందిని గమ్యస్థానాలకు చేర్చాయన్నారు. సంస్థకు రూ.51,61,834 ఆదాయం లభించిందని తెలిపారు. సహకరించిన డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది, ప్రయాణికులకు ధన్యవాదాలు చెప్పారు.

క్లుప్తంగా

26న ఉమ్మడి గుంటూరు ఖోఖో జట్ల ఎంపిక

నకరికల్లు: ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలోని జె.పంగలూరులో మహిళల, పురుషుల రాష్ట్రస్థాయి ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలను ఫిబ్రవరి 7,8,9 తేదీలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి చింతా పుల్లయ్య బుధవారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పురుషుల, మహిళల ఖోఖో జట్ల ఎంపికకు గాను ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి నకరికల్లులోని ఉన్నత పాఠశాలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనేందుకు వయోపరిమితి లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆసక్తిగలవారు ఎవరైనా సెలక్షన్స్‌కు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 9866925108 నంబరులో సంప్రదించాలని సూచించారు.

26న సత్తెనపల్లి - అరుణాచలం ప్రత్యేక బస్సు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 26న అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ (2+2 పుష్ బ్యాక్) బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ బుధవారం తెలిపారు. ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకి బస్సు బయలుదేరి 27వ తేదీ తెల్లవారుజామున అరుణాచలం చేరి దర్శనం అనంతరం తిరిగి కంచి మీదుగా 28న ఉదయం సత్తెనపల్లికి చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రాను పోను ఒక్కొక్కరికి రూ.2,100 మాత్రమేనన్నారు. భక్తులు, యాత్రికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోగలరని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9959225429, 7382897583, 7382896966, 7382897116 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

యువతిపై లైంగిక దాడి

ఇద్దరిపై కేసు నమోదు

మాచవరం: స్నేహంగా ఉంటూ ఫొటోలు దిగి.. ఆపై ఆ ఫొటోలు అడ్డంపెట్టుకుని యువతిని బెదిరించి లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచవరం గ్రామానికి చెందిన యువతికి గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు పరిచయం అయ్యాడు. పరిచయం స్నేహంగా మారి స్నేహపూర్వకంగా ఫొటోలు దిగారు. యువతికి ఇటీవల వివాహం కుదరడంతో, తనతో దిగిన ఫొటోలు ఇవ్వమని యువకుణ్ని అడిగింది. గతేడాది డిసెంబర్ 12న తెలంగాణలోని నల్గొండ జిల్లా దేవరకొండ వస్తే ఇస్తానని నమ్మ బలికాడు. ఆపై తన కోరిక తీరిస్తేనే ఫొటోలు ఇస్తానని చెప్పి బెదిరించి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఘటనపై బాధిత యువతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువకునితో పాటు, ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా వ్యవహరించిన మరో మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మహంకాళి



వినుకొండ(నూజెండ్ల): ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా నూతన అధ్యక్షుడిగా మహంకాళి సుబ్బారావు, కార్యదర్శిగా షేక్ సుభానిలను ఎన్నుకున్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏఐవైఎఫ్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతోపాటు ఉపాధ్యక్షులుగా నర్రా రంగస్వామి, ప్రత్తిపాటి నాగరాజు, ఎం.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా కె.మల్లికార్జున్, మర్రివేముల మరియదాసు, కోశాధికారిగా రొద్దా అంజిరెడ్డిలను ఎన్నుకోవడం జరిగింది.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై హత్యాయత్నం

- ఎస్సీ కార్యకర్త సురేష్‌ను అంతమొందించేందుకు టీడీపీ నేతల యత్నాలు
- కొందరు వ్యక్తులను సుపారీకి నియమించుకున్న వైనం
- తీవ్రగాయాలపాలైన సురేష్.. ఆస్పత్రికి తరలింపు
- అమర్తలూరు మండలం ప్యాపర్రులో ఘటన



తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో సురేష్‌ను పరామర్శిస్తున్న వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): మండలంలోని ప్యాపర్రు గ్రామానికి చెందిన ఎస్సీ నాయకుడు, వైఎస్సార్ సీపీ కార్యకర్త మూట సురేష్‌పై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే ప్యాపర్రు గ్రామంలో రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్‌లో సురేష్ ఉద్యోగం చేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అతణ్ణి ఉద్యోగం నుంచి తొలగించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ విషయమై గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, తెలుగుదేశం నాయకుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. దీంతో టీడీపీ నాయకులు సురేష్‌పై దాడి చేసేందుకు కొందరు వ్యక్తులను సుపారీకి నియమించుకున్నారు. ఈక్రమంలో ప్లాంట్‌లో విధుల్లో ఉన్న సురేష్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని ఎస్ఐ అమర్‌వర్ధన్ బుధవారం తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై, సహకరించిన వారిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి: వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): వైఎస్సార్ సీపీ నేతలపై కూటమి నాయకుల కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. కూటమి నేతల ప్రోద్బలంతో తీవ్రంగా గాయపడి తెనాలి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎం.సురేష్‌ను బుధవారం అశోక్‌బాబు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకుడు సురేష్‌పై హత్యయత్నానికి పాల్పడిన దుండగులను గుర్తించి వారిని ప్రోత్సహించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. శాంతియుతంగా ఉన్న గ్రామాల్లో కూటమి నేతలు అలజడులు సృష్టిస్తూ, హత్యాయత్నాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, చర్యలపై పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడాల్సిన పని లేదన్నారు. ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దాడులను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం



తెనాలి ప్రభుత్వం వైద్య శాలలో సురేష్‌ను పరామర్శించిన మేరుగ నాగార్జున

వేమూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. టీడీపీ నేతలు చేయించిన దాడుల్లో తీవ్రంగా గాయపడి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త సురేష్‌ను బుధవారం మేరుగ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత జిల్లాలో కూటమి నాయకుల దాడులు పెచ్చుమీరాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యక్తలను టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, వారిపై ప్రైవేటు కేసులు వేసేందుకు వెనుకాడమని స్పష్టం చేశారు. ప్రతి నాయకుడు, కార్యక్తకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సురేష్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట చందోలు డేవిడ్ విజయకుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గోటిపాటి హేమ చంద్ర శ్రీనివాసరావు, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేపు డాక్టర్ సీతారామమ్మ స్మారక బంగారు పతకం ప్రదానం

గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుందరాచారి ఎంపిక



డాక్టర్ సీతారామమ్మ వడ్లమూడి



డాక్టర్ ఎస్‌వీ సుందరాచారి

తెనాలి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తెనాలిశాఖ ఆధ్వర్యంలో గుంటూరు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారికి ఈనెల 24వ తేదీన డాక్టర్ వడ్లమూడి సీతారామమ్మ స్మారక బంగారు పతకం ప్రదానం చేయనున్నారు. ఐఎంఏ, తెనాలి కార్యాలయంలో పురస్కారాన్ని అందజేయనున్నారు. అనంతరం డాక్టర్ సుందరాచారి, డాక్టర్ సీతారామమ్మ స్మారకోపన్యాసం చేస్తారు. తెనాలికి చెందిన ప్రముఖ వైద్యురాలు సీతారామమ్మ ఎమర్జెన్సీ వైద్యసేవల్లో స్పెషలైజేషన్ లేని రోజుల్లో అమెరికాలో అత్యవసర వైద్యవిభాగంలో సేవలందించారు. గుంటూరు వైద్య కళాశాలలో 1970లో ఎంబీబీఎస్ చేశారు. బాపట్లలో తన తండ్రి పేరుతో నంబూరి సుబ్బయ్య మెమోరియల్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. రెండేళ్ల అనంతరం తెనాలికి చెందిన ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడిని వివాహం చేసుకున్నారు. భర్తతో కలిసి అమెరికా వెళ్లారు. డెట్రాయిల్‌లోని ఫ్లిమత్ జనరల్ హాస్పటల్లో వైద్యురాలిగా చేరారు. డెట్రాయిల్ మెమోరియల్ హాస్పటల్, సౌత్ మెకోంచ్ హాస్పటల్‌లో రొటేటరీ ఇంటర్న్‌షిప్ చేశారు. అమెరికాలో ప్రముఖ వైద్యశాలల్లో పనిచేశారు. 2014లో ఉద్యోగ విరమణ చేశారు. అనారోగ్య కారణంగా 2020లో మృతిచెందారు. ఆమె స్మారకంగా అవార్డును ప్రదానం చేయనున్నారు.

మహిళా ఎన్‌సీసీ కేడెట్లు భారత సైన్యంలో చేరాలి

కల్నల్ పునీత్ కుమార్



గుంటూరు ఎడ్యుకేషన్: మహిళా ఎన్‌సీసీ కేడెట్లు భారత సైన్యంలో చేరాలని గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ అధికారి కల్నల్ పునీత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏపీ ట్రెక్-3లో పాల్గొన్న ఎన్‌సీసీ మహిళా కేడెట్లకు భారత సాయుధ దళాల్లో చేరడంపై ఒక ప్రేరణాత్మక ఉపన్యాసం అందించారు. ట్రెక్ కార్యకలాపాల్లో భాగంగా యువ కేడెట్లకు భారత సైన్యంలో చేరడానికి మార్గనిర్దేశనం చేశారు. కల్నల్ పునీత్ కుమార్ మాట్లాడుతూ భారత సైన్యంతో పాటు, నావికాదళ, వాయుసేనల్లో అందుబాటులో ఉన్న వివిధ వృత్తి అవకాశాలను వివరించారు. ఎన్డీఏ, సీడీఎస్, టెక్నికల్ ఎంట్రీ వంటి పథకాల అర్హత ప్రమాణాలు, ఎంపిక ప్రక్రియలు, శిక్షణ విధానాలపై అవగాహన కల్పించారు. సైన్యంలో విజయం సాధించడానికి అవసరమైన క్రమశిక్షణ, అంకితభావం, దేశభక్తి వంటి విలువల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లు సైన్యంలో చేరేందుకు సన్నద్ధత, రణనీతి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రశ్నలు అడిగారు. కల్నల్ పునీత్ కుమార్ కేడెట్లను ప్రోత్సహిస్తూ, దేశానికి గర్వంగా సేవ చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



పిడుగురాళ్ల: యరపతినేని లక్ష్మయ్య స్మారక రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక జీపీ రెడ్డి గ్రూప్ స్కాలర్స్ డిగ్రీ కళాశాలలో ఈ పోటీలను వైద్యుడు వున్నం నాగమల్లేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ పోటీలు ప్రారంభించడం శుభపరిణామమన్నారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.60వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. స్కాలర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల జనార్ధన్‌రావు, వడ్లపల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, పిల్లి చెన్నారావు, పాండురంగా శ్రీనివాసరావు, కామిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య



దర్శి సురేష్ (ఫైల్)

పెదకూరపాడు: అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దకూరపాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. మిట్ట ప్రాంతానికి చెందిన దర్శి సురేష్ (37) గత ఐదు సంవత్సరాల నుంచి పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. నష్టాలు రావడంతో సొంతగా ట్రాక్టర్ కొనుగోలు చేసి వ్యవసాయ కూలి పనులకు వెళుతున్నాడు. ఆదాయం రాకపోవడంతో ట్రాక్టర్‌కు సంబంధించి ఈఎంఐ కట్టలేక, మరోవైపు కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరితో చెప్పకుండా ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సురేష్ పెదకూరపాడులోని పొట్ట చెట్టు సమీపంలో పురుగుల మందు తాగి విగతజీవిగా పడి ఉండటం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులు పెదకూరపాడు పోలీసులకు సమాచారం అందించారు.

ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: ప్రజలకు నిరంతరం అవసరమయ్యే ఇసుకను వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా ఇసుక కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇసుక తవ్వకాల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు 15 రోజుల్లో తనిఖీ చేసి ఆమోదం కోసం జిల్లా స్థాయి ఇసుక కమిటీకి ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాలో పది ఇసుక పట్టా భూముల్లో, 4.93 హెక్టార్ల ప్రభుత్వ భూముల్లో ఇసుక తవ్వకాల కోసం చేసుకున్న దరఖాస్తులను కమిటీలో ఆమోదించినట్లు వెల్లడించారు. వీటికి సంబంధించి పర్యావరణ అనుమతులు వచ్చిన వెంటనే తవ్వకాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా మరో 70 ఎకరాల్లో ఇసుక తవ్వకాల కోసం వచ్చిన దరఖాస్తులను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, డీఆర్వో షేక్ ఖాజావలి, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి వెంకటసాయి, రవాణా శాఖ జిల్లా ఉప కమిషనర్ కె.సీతారామిరెడ్డి, డీపీఓ బి.ఎన్.ఎన్.సాయికుమార్ పాల్గొన్నారు.

గ్రామీణ ఎస్సీ మహిళలకు సబ్సిడీ రుణాలు

నెహ్రూనగర్: గ్రామీణ ప్రాంతాల్లో డ్వాకా సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎస్సీ మహిళలకు ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతీ అభ్యుదయ యోజన(పీఎం అజయ్) కింద సబ్సిడీ రుణాలు అందించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 82 యూనిట్లు చొప్పున రూ.1.64 కోట్లు మంజూరు అయినట్లు చెప్పారు. 18 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉన్న డ్వాక్రాలోని ఎస్సీ మహిళలకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నామన్నారు. ఈ పథకం కింద రూ.50 వేల రాయితీతో వివిధ యూనిట్లు ఏర్పాటు చేసుకుందేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

మాతృమరణాలపై సమీక్ష

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం జిల్లాలో మాతృ మరణాలపై కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదపరిమి గ్రామంలో డిసెంబర్ నెలలో జరిగిన ఒక మాతృ మరణానికి గల కారణాలను కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ మరణం గర్భస్థ కారణాల వల్ల జరిగింది కాదని వెల్లడించారు. సమావేశంలో కమిటీ సభ్యులు డి.సి.హెచ్.ఎస్ డాక్టర్.ఎం. మజీదాబి, డాక్టర్ అరుణ, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ సుధీర్ బాబు, డాక్టర్ ఆదిత్య ప్రదీప్ రెడ్డి, డాక్టర్ రాధిక రాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రావణ్ బాబు, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్, ఐసీడీఎస్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

మంచు ఘడియలు



అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేపై కమ్ముకున్న మంచు

గత నాలుగు రోజుల నుంచి జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. చలికి తోడు రాత్రి మొదలుకుని ఉదయం వరకు దట్టమైన పొగ మంచు కురుస్తోంది. బుధవారం ఉదయం 6 గంటల నుంచి 9:30 వరకు పొగమంచు కురిసింది. ఎదురుగా ఉన్న మనిషి కనపడనంత దట్టంగా పొగ మంచు ఉండటంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

– సత్తెనపల్లి, దాచేపల్లి



సత్తెనపల్లి గడియార స్తంభం సెంటర్‌లో ఉదయం 9.30 గంటలకు పరిస్థితి

మరికొన్ని ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు పరిశీలన



రీచ్‌లను పరిశీలిస్తున్న జాయింట్ యాక్షన్‌టీం

అచ్చంపేట: మండలంలో 10 ఇసుక రీచ్‌లుండగా ఇసుక సరఫరాకు నాలుగు ఇసుక రీచ్‌ను టెండరు విధానంలో ఎంపిక చేసిన విషయం తెలిసిందే.. మరికొన్ని ఇసుక రీచ్‌లకు అనుమతులిచ్చేందుకు బుధవారం మైనింగ్, గ్రౌండ్‌వాటర్, పొల్యూషన్, రెవెన్యూ శాఖల అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. గింజుపల్లి, చల్లగరిక, చింతపల్లి, చామర్రు, కోగంటివారిపాలెం, కస్తల రీచ్‌ను పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్ అనలిస్ట్ వై.అనిల్ కుమార్, మైనింగ్ సర్వేయరు వీవీ రవితేజ, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ బి.పూర్ణచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.రామారావు, గ్రౌండ్ వాటర్ డీజీడబ్ల్యూఓ వి.శ్రీనివాసరావు, కృష్ణా రివర్ డీఈఈ ఎస్.అజయ్‌బాబు, ఏఈఈ పి.ప్రభు, సంబంధిత గ్రామాల వీఆర్వోలు రీచ్‌లను పరిశీలించినవారిలో ఉన్నారు. మండలంలో ఇప్పటికే అనుమతించిన నాలుగు రీచ్‌లలో ప్రస్తుతం ఒక రీచ్ నుంచే ఇసుక సరఫరా అవుతోంది. ఒక రీచ్‌ని అక్రమ మైనింగ్ జరుగుతున్న కారణంగా సంబంధిత అధికారులు మూసేశారు. మరో రెండు రీచ్‌లను ఇంతవరకు ప్రారంభించలేదు.

మల్లాదిలో టీడీపీ, జనసేన కార్యకర్తల బాహాబాహీ

అమరావతి: మండల పరిధిలోని మల్లాదివట వృక్షాంతర్గత వేంకటేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాత్రి ఆలయ పరిసరాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయటం ప్రతి ఏడాది ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో అటు టీడీపీ, ఇటు జనసేన పార్టీ పోటాపోటీగా అన్నదాన కార్యక్రమాలతో పాటుగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇరు పార్టీల వారికి వివాదం ఏర్పడింది. ఈక్రమంలో ఒకరికొకరు బాహాబాహీ దిగారు. దీంతో రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకచోటికి చేరుతుండటంతో పోలీసులు ఇరువర్గాల వారిని చెదరకొట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలను రద్దు చేసి అందరినీ అక్కడి నుంచి పంపించి వేశారు. మల్లాది గ్రామం గతంలో ఫ్యాక్షన్ గ్రామం కావడంతో శాంతిభద్రతలను సమీక్షించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్‌పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కృత్రిమ మేధతో వ్యవసాయ రంగంలో పెను మార్పులు

కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ



అవగాహన పత్రాలను మార్చుకుంటున్న కేఎల్‌యూ, థాయ్‌లాండ్ వర్సిటీ ప్రతినిధులు

తాడేపల్లిరూరల్: కృత్రిమ మేధతో వ్యవసాయ రంగంలో పెనుమార్పులు రానున్నాయని కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ పేర్కొన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ, థాయ్‌లాండ్‌కు చెందిన స్కూల్ ఆఫ్ రెన్యూవబుల్ ఎనర్జీ మయిజో యూనివర్సిటీతో ఏఐతో అవగాహన ఒప్పందాన్ని బుధవారం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఉద్యోగుల మార్పు, వ్యవసాయ పరిశోధనలలో భాగస్వామ్యం, విద్యార్థులకు ఉమ్మడి ఇంటర్న్‌షిప్‌లను కల్పించడంలో ఒప్పందం కీలకం కానుందని వివరించారు. వ్యవసాయ కళాశాల విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందంతో ఉద్యోగ అవకాశాలు పెరిగినట్లు చెప్పారు. అనంతరం అవగాహన ఒప్పందాలపై కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, స్కూల్ ఆఫ్ రెన్యూవబుల్ ఎనర్జీ మయిజో యూనివర్సిటీ ప్రతినిధులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియాకు ఏఎన్‌యూ క్రీడాకారుల అర్హత

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థులు ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొనే అర్హతను సాధించారు. వర్సిటీ నుంచి ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో నిర్వహించిన అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయాల ఇంటర్ జోనల్ వెయిట్ లిఫ్టింగ్ పురుషుల చాంపియన్‌షిప్ పోటీల్లో 61 కిలోల విభాగంలో డి.మౌలాలి కాంస్య పతకాన్ని సాధించారు. అలాగే 96 కిలోల విభాగంలో ఎం.అశోక్ 6వ స్థానంలో నిలువగా, 102 కిలోల విభాగంలో జి.కృష్ణబాబు నాలుగో స్థానంలో నిలిచారు. దీంతో ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించటం జరిగిందని వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ తెలిపారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టర్ ఆచార్య కె.రత్నషీలామణి క్రీడాకారులను అభినందించారు.